# చరిత్రలో కనబడని వాళ్లు

"హితశ్రీ"

"జగన్మోహనరావుతో మాట్లాడటం మానేశావుటగా?"

"వాడే మానేశాడు."

"ఏం?"

"ఎవరి అభిరుచుల్ని బట్టి వాళ్ళకి స్నేహ బృందం ఏర్పడుతూ ఉంటుంది."

"నీ అభిప్రాయం నాకు సరిగా అర్థం కాలేదు."

"నాకు సాహిత్యంమీద అభిరుచి ఉందనుకో. సామాన్యంగా నా స్నేహితులు రచయితలుగానో, లేక సాహిత్యంమీద గౌరవం, అభిరుచి ఉన్నవాళ్ళుగానో ఉంటారు. మిగతా రకం స్నేహితులు ఉండరని కాదు; కాని చెప్పుకో తగ్గ స్నేహం ఉండదనుకుంటాను. జగన్మోహనరావుకి సాహిత్యమంటే మంట. ఎప్పుడూ ఆ విషయాలే మాట్లాడతానని నామీద కోపగించుకున్నాడు."

"వాడిమీద నువ్వు ఇదివరకంతటి గౌరవం చూపించటం లేదని వాడన్నాడు."

"చెప్పానుగా! వాడికి నేను మాట్లాడే విషయాలు నచ్చవు."

"ఎప్పుడూ సొంత రచనల్నిగురించి డబ్బా వాయించుకోటమేగాని, అవతల వాళ్ళకి దాని వల్ల ఎంత తలనొప్పి కలుగుతున్నదీ, గ్రహించవని అంటాడు వాడు."

"లేకపోతే, గానుగెద్దులా గుమాస్తా చాకిరీ చేసేవాడికి సాహిత్య పిపాస ఎలా ఉంటుంది? ఆఫీసర్ ఏ గుమాస్తామీద ఎలా రాసిందీ చెబుతుంటే సంతోషపరవశుడయ్యే వాడికి కథల ప్రసక్తి వొస్తే తలనొప్పి వస్తుంది, వికారమూ వొస్తుంది. దానికి నేనేం చెయ్యను?"

"వాడికంటే నువ్వు ఎన్నో రెట్లు గొప్ప వాడిలా అహంకారంతో ప్రవర్తిస్తావని కూడా అన్నాడు."

"అహంకారం సంగతి ఎలా ఉన్నా, వాడికంటే నేను ముమ్మాటికీ గొప్పవాడినే. కాలక్రమేణా నా కథలే ఈ సంగతి రుజు చేస్తాయి."

"వెంకట్రావు, శాస్త్రి కూడా నీకు చాలా గర్వ ముందంటారు."

"ఉంటే ఉండవచ్చు. గర్వించతగిన కథలు నేను రాయకపోలేదు."

"వాళ్ళతో సరిగ్గా మాట్లాడవుటగా?"

"ఏం మాట్లాడను? నోళ్ళు తెరిస్తే అవాకులూ, చెవాకులూ. నువ్వేమనుకోకుండా ఉంటే ఒకమాట చెబుతాను. పొద్దున లేస్తే, రాత్రి పడుకునేదాకా ఆ ఫైల్సు ముందువేసుకు కూచోటమేగాని, ఓనవల, లేకపోతే ఓ పత్రిక చదవటంగాని, ఏదైనా రాయటానికి ప్రయత్నించటంగాని లేదుగదా వాళ్ళలో ఒక్కడికి కూడా! గాడిలో పడటం, గానుగెద్దుల్లా తిరగటం, బండచాకిరీ. ఇదేనా జీవితం? వాళ్ళందరికంటే నేను మెరుగని అనుకోటంలో తప్పుగాని, బేసబబుగాని నాకేం కనిపించటంలేదు."

"ఊఁ."

"సిన్సియర్‌గా చెబుతున్నాను. సొంతడబ్బా అనుకోకు. చరిత్ర పుటల్లో ఎప్పటికైనా ముద్రించబడేది నా పేరే. వాళ్ళల్లో ఒక్కడు కూడా చరిత్రలో బతకడు. ఏం చేశారని చరిత్ర వాళ్ళనిగురించి రాస్తుంది? ఏం సాధించారు? పోనీ ఏం సాధించే ప్రయత్నంలో విఫలులైనారు? మన దేశంలో బహుళంగా ఇలాంటి వాళ్ళే తయారవుతూండటం నాకు విచారం కలిగిస్తోంది."

సుబ్బారావు ముఖంలో ఏదో మార్పు కనిపించటంవల్ల ఇహ నేను అంతటితో ఆపేశాను. బహుశా, ఈవిషయం వాడికి ఉత్సాహకరంగా లేదేమో! కాసేపాగి వాడే అన్నాడు.

"ఏదో నవల రాస్తున్నట్టున్నావు. పూర్తి చేసావా?"

"లేదు. అందుకే ఈ కాగితాలు. ఇంటికి వెళ్ళగానే రాయటానికి కూచుంటాను."

సుబ్బారావు నా చేతిలోని కాగితాల వైపు చూసి ఒక క్షణం ఆగి అన్నాడు.

"ఎక్కడ కొన్నావు?"

"బజార్లో."

"ఏ షాపులో?"

"సిటిజన్స్ స్టోర్స్‌లో"

"ఈమధ్య కాగితాలు సులభంగా దొరకటం లేదల్లే ఉంది. వాళ్లెక్కణ్ణించి తెప్పిస్తారు?"

"ఏ హోల్ సేల్ వ్యాపార సంస్థో సబ్ ఏజన్సీఇచ్చి ఉంటుంది"

"వాళ్ళకి...?"

"పేపర్ మిల్స్ లేవూ?"

"అన్నట్టు పేపరు దేంతో తయారు చేస్తారూ?"

"భలే వాడివి. వెదురుతో, ముఖ్యంగా"

"అవునవును. చిన్నప్పుడు జాగ్రఫీలో చదివినట్టు జ్ఞాపకం. అడవుల్లో వెదుళ్లుకొట్టి నదుల్లోకి తోసేసి పేపరు మిల్లులకి చేరుస్తారనీ, నదుల వలన ఉపయోగాల్లో ఇది ఒకటనీ చదివాం. పాపం, ఈ కూలీలపని చాలా కష్టం. అడవుల్లో చెట్లని కొట్టటం, వాటిని మిల్లులకి చేర్చటం-ఏం జీవితాలో! పొద్దున లేచినప్పటినించీ, సాయంత్రం దాకా ఇదే పనిగదా!"

"నిజమే, మరి"

"ఇంత చాకిరీచేసినా వాళ్ళకి సరైనజీతాలు ముడతాయా అని...?"

"అలాగైతే లేందేముంది?"

"పోనీ ఆ ఇచ్చే జీతాలయినా సక్రమంగా, సకాలంలో ఇస్తారా?"

"కంట్రాక్టర్ల దయ. లేకపోతే మిల్లు వాళ్ళ దయ. ఇంకా చెప్పాలంటే గుమస్తాల దయ."

"ఏం?"

"బిల్లులు ప్యాస్ కావొద్దూ? అసలే గుమస్తాలకి చచ్చే చాకిరీ. ఊపిరి పీల్చుకోటానికి కూడా టైముండదు."

సుబ్బారావు నవ్వాడు. నాకు మాత్రం వాడు నవ్వటం అర్థరహితంగా కనపడ్డది. ఇందులో నవ్వేందుకేముంది? కాసేపాగి వాడు నా జేబులో కలం లాగి అన్నాడు.

"ఏం కలం?"

"స్వదేశీ దే"

"మంచి కలంలానే ఉంది. కలం మంచిదైతేగాని భావాలు దొర్లవు కాబోలు."

నవ్వాను.

"రాజమండ్రిలో తయారైంది. నా స్నేహితుడు ఒకడు రాజమండ్రిలో కలాలు తయారు చేసే వ్యాపారం పెట్టాడులే. చవగ్గా కొట్టేశాను."

"ఏం సిరా వాడతావు?"

"బ్లూ బ్లాక్"

"ఏ మార్కు?"

"సీల్ కాల్"

సుబ్బారావు వేసే చొప్పదంటు ప్రశ్నలకి నాకు చిరాకు వేసుకొస్తోంది. వాడేదో కాస్తో కూస్తో సారస్వతాభిమాని అనుకుంటోంటే వాడి స్వరూపం కాస్తా బయట పెట్టుకుంటున్నాడు.

"ఎవరు రాసే కాగితాలు, సిరా, కలాలు వాళ్ళే తయారు చేసుకోగలిగితే బావుండదూ?"

వీడేదో ఊహా ప్రపంచంలో షికార్లు చేస్తున్నట్టున్నాడు. వీణ్ణి ఎంత తొందరగా వొదిలించుకుంటే అంత మంచిది. అంచేత "ఎందుకు బావుండదూ!" అనేసి వెడదామని ప్రయత్నం చేసేసరికి వాడు బలవంతాన కూర్చోపెట్టి "వెడుదువుగానిలే, ఇంతలో ఏం కొంపలంటుకోవు" అన్నాడు. బయటికి కనబడకుండా ముఖం చిట్లించుకుని కూచున్నాను చేసేదేమీలేక.

"ఆదివారాలు పోస్టాఫీసులు పని చెయ్యక పోవటం నీబోటి రచయితలకి చాలా ఇబ్బందేమో?"

"కొంతవరకు ఇబ్బందే అని చెప్పాలి"

"అసలు పోస్టాఫీసులు పనిచెయ్యకపోతే?"

సుబ్బారావు వైపు ఆశ్చర్యంగా చూశాను. "వీడికి మతి స్థిరంగానే ఉందా?" అనే ఆలోచనకి నా మెదడు కొంచెం చోటిచ్చింది.

"ఎందుకు చెయ్యవు?"

సుబ్బారావు నవ్వాడు. సమాధానం మాత్రం ఇవ్వలేదు.

"వాడెవడో ఆ కంపోజిటరు నువ్వు రాసేవన్నీ చచ్చేటట్టు కూర్చాలన్న మాట. లేకపోతే నీ కథలు చరిత్రలో రాకపోవటం అలా ఉంచి, సోదిలోకి కూడా రావేమో!"

"ఇదే భావంతో కంపోజిటర్‌ని గురించి ఓ కథ రాయాలనుకుంటున్నాను."

"కథలు రాసేవాళ్లు తిండిలేకపోయినా బతుకుతారని ఎవరో అన్నట్టు జ్ఞాపకం."

"ఆ అన్నవాడెవరోగాని నేను మాత్రం కాదు. తిండి లేకపోతే కలం ముందుకి సాగదు నాకు మటుకు."

"అయితే రేషన్ కార్డు నీకూ కావాలన్న మాట."

"నేనుమాత్రం మనిషిని కానా నీ అభిప్రాయం? కథలు రాసేవాళ్ళని గురించి ఇటువంటి వింత భావాలు ప్రబలటం దురదృష్టం."

"రైతులు పండించే ధాన్యానికి నువ్వూ లెక్క చెబుతున్నావన్న మాట. గుమాస్తాలకీ, రేషన్ డిపోలకీ నువ్వూ పని కలిగిస్తున్నావు."

"ఆహా."

"ఒక విషయం అడగనా?"

"నిరాఘాటంగా."

"నువ్వు కథ రాయాలంటే కావలసిన కనీసపు షరతులు-కడుపునిండా తిండి, కాగితం, కలం, సిరా. నీ కథ ప్రజానీకం చదవాలంటే-పోస్టాఫీసులు, కంపోజిటర్లు మొదలైనవాళ్ళు అవసరం. కాగా నీకు కావలసిన విటమినులతో కూడిన అహారంగాని, కాగితం, సిరా ఇత్యాదులు కాని చెట్టుమీదనించి ఊడిపడవు. నువ్వు సొంతంగా తయారుచేసుకోవాలి. నువ్వు చేసుకోలేవు. ఎవరో చేసిపెట్టాలి. ఇవన్నీ అమరిస్తే నువ్వు కథలు రాస్తావు. ఒకటి జ్ఞాపకం ఉంచుకో. జగన్మోహనరావు, వెంకట్రావు, శాస్త్రి నీకు కావలసిన వస్తువులు అమర్చే వాళ్ళలో కొంతమంది. వాళ్ళు గానుగెద్దుల్లా చాకిరీ చెయ్యబట్టే నీకు తిండి, కాగితం, సిరా దొరుకుతున్నాయి. చరిత్రలో నీ పేరేదో పడుతుందన్నావే, నీ పేరుపడే చరిత్ర కాగితం తయారుచేసే దెవరు? నీపేరు రాయటానికి కలం, సిరా తయారుచేసే దెవరు? నీపేరు జనం మర్చిపోకుండా ఉండటానికి కారణ మెవరు? వాళ్ళకంటే నువ్వు గొప్పవాడివా? అధికుడివా? నీ జీవితం సాఫీగా సాగిపోవటానికి కారణభూతమైన వాళ్ళకంటె నువ్వేవిధంగా గొప్పవాడివి? పొద్దుటినించీ చీకటి పడేదాకా వొంచిన నడుమెత్తకుండా కాయ కష్టం చేసే రైతు నీకు తిండి పెడుతున్నాడు. పేపరు మిల్లువాళ్లు కాగితం సప్లయిచేసి రాసుకోమంటున్నారు. రాజమండ్రి స్నేహితుడు కలం ఇచ్చి రాసుకోమన్నాడు. నీల్ కాల్ వాళ్లు సిరా పోశారు. నువ్వు తీరిగ్గా కూచుని ఆలోచిస్తూ వీళ్ళందరికంటె నువ్వు గొప్పవాడివని భుజాలు ఎగరేసుకుంటున్నావు. ఇదేనా నీకు గర్వకారణం?"

సుబ్బారావు వైపు తెల్లముఖంతో చూస్తున్న నేను, వాడు ఉపన్యాసం ముగించిన రెండు నిమిషాలదాకా మాట్లాడలేకపోయాను. వాడికే జాలేసిందేమో, "ఇహ పోదాంలే" అన్నాడు, రెక్కపట్టుకు నుంచోపెట్టి. నిశ్శబ్దంగా నడుస్తున్నాం. పార్కు దాటి కొంత దూరం వెళ్ళాక సుబ్బారావు అన్నాడు.

"నువ్వు కథలు రాయగలిగితే రాయొచ్చు కాని లక్షలకొలది ప్రజలు రోజూ సతమతమవుతూ నీకా సౌకర్యం కలిగిస్తూన్నారని మరిచిపోకు. ప్రయోజకుడివైతే వాళ్ళ ఋణం తీర్చుకో. వాళ్ళని గౌరవించటం నేర్చుకో. పని చెయ్యటం గౌరవదాయకమనే సంగతి జీవితంలో మరిచిపోకు. అప్పుడు నువ్వు ఎవర్నీ తక్కువగా చూడలేవు."

"నిజం" అన్నాను హీనస్వరంతో.